మళ్లీ వచ్చాడు!

ఓటీటీ హిట్

బెర్లిన్

నెట్‌ఫ్లిక్స్: డిసెంబర్ 29
నటీనటులు: పెడ్రో అలన్సో, ట్రిస్టాన్ ఉల్లావ్, మైఖేల్ జెన్నర్, బెగోనా వర్గాస్ తదితరులు
దర్శకత్వం: అలెక్స్ పినా, ఎస్తర్ లొబాటో
మనీ హెయిస్ట్-5 స్పానిష్ వెబ్‌సిరీస్ నెట్‌ఫ్లిక్స్ ప్రేక్షకులను ఎంతలా అలరించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. స్పానిష్‌తోపాటు ఇంగ్లిష్, హిందీ, తెలుగు తదితర భాషల్లోనూ రికార్డు స్ట్రీమింగ్ సొంతం చేసుకుంది. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగే ఆ సిరీస్‌లో అందరినీ అలరించిన క్యారెక్టర్ బెర్లిన్. ఆ పాత్రలో జీవించిన పెడ్రో అలన్సోకు లక్షల మంది అభిమానులయ్యారు. మనీ హెయిస్ట్‌కు ప్రీక్వెల్‌గా రూపొందిన వెబ్‌సిరీస్ 'బెర్లిన్' తాజాగా స్ట్రీమింగ్ అవుతున్నది. ఎవరీ బెర్లిన్, అతని గత మేంటి? అతణ్ని ముగ్గురు భార్యలు ఎందుకు వదిలిపెట్టారు? కొడుకుతో అతని అనుబంధం అంశాలతో ఎనిమిది ఎపిసోడ్లతో ఈ వెబ్‌సిరీస్ నిర్మించారు. కథలోకి వెళ్తే బెర్లిన్ తన టీమ్‌తో కలిసి విలువైన నగల దొంగతనానికి ప్రణాళిక రచిస్తాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నగలను కొల్లగొట్టడానికి ప్రయత్నిస్తుంటాడు. ఇందుకోసం అతనేం చేశాడు, వాటిని దొంగిలించడంలో సఫలమయ్యాడా లేదా అన్నది మిగిలిన కథ. మొదటి మూడు ఎపిసోడ్లలో దొంగతనానికి వేసే స్కెచ్‌లు ఆకట్టుకుంటాయి. ఆ తర్వాత ఎపిసోడ్లలో ఆసక్తికరమైన మలుపులు అలరిస్తాయి. బోల్డ్ సన్నివేశాలు ఉండటం వల్ల అందరితో కలిసి చూడలేం.

నా ఆత్మకథలో.. అన్నీ ఉంటాయి!

పాపమైనా పుణ్యమైనా.. జీవి చేసే చర్యకు భగవంతుడిచ్చే ప్రతిచర్యనే కర్మసిద్ధాంతం అంటారు. బ్రహ్మానందంతో కాసేపు మాట్లాడినప్పుడు.. ఆయన జీవితాన్ని పరికించి చూసినప్పుడు.. కర్మసిద్ధాంతానికి ప్రతీకగా కనిపించారు. కర్మసిద్ధాంతం అనేది జగత్తుకు ఈశ్వరుడు ఇచ్చిన వరం అంటారాయన. అందులో నిజం లేకపోతే... ఆ బ్రహ్మానందం అనే పేరేంటి?.. పుట్టెడు బాధల్లో ఉన్నవాణ్ని కూడా ఒక్కలుక్కుతో ఫక్కున నవ్వించగలగటమేంటి? దశాబ్దాలపాటు కావాల్సినన్ని నవ్వుల్ని పంచి, కోట్లాదిమందిని రుణగ్రస్తుల్ని చేయటమేంటి? ఎవరో రాసిన స్క్రిప్ట్‌లా లేదూ!? తల్లిదండ్రులు ఇదంతా ముందే ఊహించి ఆ పేరు పెట్టరుగా? అదే కర్మసిద్ధాంతం అంటే. ఇదంతా గతజన్మ పుణ్యఫలం.. ఈశ్వర కవనం.

బ్రహ్మానందం అనగానే అందరూ గొప్ప హాస్యనటుడు అంటారు. కొందరు మహానటుడు అంటారు. కానీ, ఆయనతో కాసేపు కూర్చుంటే తనలో ఓ తత్వవేత్త కనిపిస్తాడు. ఆధ్యాత్మికవేత్త వినిపిస్తాడు.. బ్రహ్మజ్ఞానిగా గోచరిస్తాడు. ఆ జ్ఞానాన్నంతా క్రోడీకరించి, తన జీవితాన్ని భావితరాలకు పాఠ్యాంశం చేయాలనే సంకల్పంతో బ్రహ్మానందం చేసిన ఓ గొప్ప ప్రయత్నం.. ఆత్మకథ రాసుకోవడం. 'నేను మీ బ్రహ్మానందం', 'ME YOURS BRAHMANANDAM' పేర్లతో తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో తన ఆత్మకథను గ్రంథస్థం చేశారు బ్రహ్మానందం. ఈ సందర్భంగా ఈ పుస్తకం గురించి 'నమస్తే తెలంగాణ'తో ఆయన ముచ్చట మీకోసం..

అప్పుడే ఆత్మకథ ఆలోచన ఎందుకొచ్చింది?
ఇంకెప్పుడు రాయాలి? అంతా అయిపోయిన తర్వాత రాస్తే ఎవరు చదువుతారు? వెలుగులో ఉన్నప్పుడే చెప్పాలనుకున్నది చెప్పేయాలి. అప్పుడే మాటలకు విలువ ఉంటుంది.

మీ ఆత్మకథ ఎందుకు చదవాలి?
సూర్యుడి కాంతి జగత్తుకు ఉపయోగపడితే... మిణుగురు కాంతి దాని పరిసరాలకు ఉపయోగపడుతుంది. దేని పరిధి దానిది. అలాగే నా జీవితం కూడా కొందరికైనా వెలుగు చూపుతుందనే చిరు ఆశ. స్కూల్‌కు వెళ్లే రోజుల్లో ఓసారి మా ఇంట్లో అన్నం లేక పోతే మా పిన్నివాళ్లింట్లో భోంచేసి బడికి బయలుదేరాను. ఎదురుగా అమ్మ వస్తూ 'వంట చేస్తాను.. తినెళ్లు' అన్నది. 'స్కూల్‌కి టైమ్ అవుతుందిగదమ్మా.. అందుకే పిన్నివాళ్ల ఇంట్లో తినేశాను..' అన్నాను. చచ్చేలా కొట్టింది. గుక్కపట్టి ఏడుస్తున్న నాతో అప్పుడు అమ్మ చెప్పిన మాట ఇప్పటికీ గుర్తుండిపోయింది.. '18 రోజులు తినకుండా ఉంటే మనిషి చనిపోతాడు. కాబట్టి 17రోజులు పస్తులున్నా పర్లా.. ఈ లోపేం చావవ్.'.. ఆత్మాభిమానం అంటే ఏంటో ఆ మాటలతో అర్థమైంది. నాటినుంచి నేటి వరకూ ఎక్కడా చేయి చాచిందిలేదు. బ్రహ్మానందం జీవితంలో చెప్పుకోలేని స్ట్రగుల్స్ చాలా ఉన్నాయి. అవన్నీ ఇందులో ఉంటాయి. స్వశక్తి, దైవశక్తి సమన్వయమే జీవితం. ప్రయత్న లోపం లేకపోతే దైవం కచ్చితంగా సహకరిస్తుంది. నా ఆత్మకథ పరమార్థం కూడా అదే. ఎక్కడో మారుమూల పేదరికంలో పుట్టి పెరిగిన కుర్రాడు.. చెప్పులు కూడా కొనుక్కులేని స్థితిలో ఉన్న కుర్రాడు.. పట్టుదలతో చదువుకొని లెక్చరర్ స్థాయికి ఎలా రాగలిగాడు? సైకిల్ కొనుక్కోవడమే పెద్ద విషయమైన ఆ కుర్రాడు.. కార్లలో తిరిగే స్థాయికి ఎలా ఎదిగాడు? విమానంలో ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి చేతులమీదుగా పద్మశ్రీ ఎలా అందుకున్నాడు? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానమే ఈ పుస్తకం.

అప్పుడది జీవిత కథ అవుతుంది కానీ.. ఆత్మకథ అవ్వదుకదా?
ఆత్మవంచన లేకుండా రాసుకునే ఏ జీవితగాథ అయినా ఆత్మకథే. అవాకులు చవాకులు చదివే వాళ్లకోసం ఈ పుస్తకం రాయలేదు. మనిషి జీవితంలో వివాదాలు సహజం. వాటివల్ల సమాజానికి ఉపయోగం ఏంటి? బాధపడటం.. బాధ పెట్టడం.. తప్పు చేయడం.. తప్పు దిద్దుకోవడం.. ఆత్మవంచన చేసుకోవడం.. ఆత్మపరిశీలన చేసుకోవడం.. తల దించుకునేలా బతకడం.. తల ఎత్తుకునేలా జీవించడం.. ఇవన్నీ మానవ సహజాలు. చేసిన చెడునో.. సాధించిన ఘనతనో చెప్పుకోవడం కోసం ఈ పుస్తకం రాయలేదు. జీవితంలో ఎదురైన బాధలైనా, అవమానాలైనా, ఆనందాలైనా నాకు పాఠాలే! కష్టాలూ, అవమానాలు నన్ను బాధించలేదు. ఇప్పటివరకూ చాలామంది పెద్దవాళ్లు తమ ఆత్మకథలు రాసుకున్నారు. వాటికి పూర్తి భిన్నమైనది నా ఆత్మకథ. ఇందులో అంతా ఉండదు.. అన్నీ ఉంటాయి. ఆ గమ్మత్తేంటో చదివితేనే తెలుస్తుంది.

మీరు చదివిన ఆత్మకథల్లో మీకు నచ్చినది..
అహంకారంగా మాట్లాడుతున్నానని అనుకోవద్దు.. ఏవీ లేవు. మహామహుల ఆత్మకథలు చదివాను. ఎవరి ఆలోచనా విధానం వారిది. వారికి కరెక్ట్ అనిపించింది వారు రాశారు. చేసిన తప్పులను నిర్మొహమాటంగా చెప్పడం నిజాయతీ అని వారు అనుకున్నారు. సమాజానికి ఉపయోగపడని నిజాయతీ ఎందుకు అని నేను అనుకుంటున్నాను.

డ్రామాకు ఫిక్షన్ జోడిస్తేనే లీడింగ్ ఎమోషన్. మరి మీ పుస్తకంలో ఆ ఎమోషన్ ఉంటుందా?
లీడింగ్ ఎమోషన్ కోసం నేను రాయలేదు. ఎమోషన్, డ్రామా ఉంటేనే చదువుతా రనుకుంటే దయచేసి చదవొద్దు. చదువరులకు మసిపూసి మారేడుకాయ చేయడం నాకు చేత కాదు. చెప్పాలనుకున్నది సూటిగా చెప్పాను. భావితరాలకు ఉపయోగపడని డ్రామా, ఫిక్షన్ నాకు అవసరం లేదు.

వాస్తవాలే రాశారని మీ భార్యాపిల్లలు ఒప్పుకొనేలా మీ ఆత్మకథ ఉంటుందా?
ఎవరి దగ్గరో సర్టిఫికెట్ కోసం నేను ఈ ఆత్మకథ రాయలేదు. ఎవర్నీ సంతృప్తి పరచడం నా ఉద్దేశం కాదు. సమాజానికి ఉపయోగపడే మెటీరియల్ మాత్రమే ఇందులో వాడాను.

నీతులు చెబితే పాటించేవాళ్లు ఇంకా ఉన్నారంటారా?
నీకిష్టమైతే చదువ్.. లేకపోతే మానెయ్! నచ్చినవాళ్లే చదువుతారు. విత్తనం నాటగానే మొక్క రాదు. సమయం పడుతుంది. నా వరకైతే.. డబ్బు కోసమో.. పేరుప్రఖ్యాతుల కోసమో రాసిన పుస్తకం కాదిది. నాలో ఉన్న సంఘర్షణలన్నిటినీ పుస్తకరూపంలో పెట్టి 'ఇదికూడా మీరు అనుభవించి చావండ్రా..' అని నేను ఈ పుస్తకం రాయలేదు. అసలు కాంట్రవర్సీలే రాయాలనుకుంటే నా జీవితంలో ఉన్నన్ని కాంట్రవర్సీలు ఎక్కడా లేవు. అవన్నీ రాసి విడుదల చేస్తే పుస్తకాలన్నీ హాట్ కేకులే. కానీ, అది నా అభిమతం కాదు. మళ్లీ చెబుతున్నా. ఇందులో అంతా ఉండదు.. అన్నీ ఉంటాయి.

మరి ఇవన్నీ మీ ముందుమాటలో చెప్పారా?
ఇందులో ముందుమాటలు.. వెనుక మాటలు లేవు. బావుంటే చదువుతారు.. అంతే!

మీలోని సాహితీ అభిలాష ఈ పుస్తక రచనలో ఎంతవరకు ఉపయోగపడింది?
నేను మామూలుగా మాట్లాడినా, డైలాగ్ చెప్పినా అందులో స్పష్టత ఉంటుందంటే కారణం భాషపై నాకున్న పట్టు. పాత్రకు తగ్గట్టుగా భాష ఉండాలి. ధూర్జటిలాంటి మహాకవీంద్రులే తమ కావ్యాల్లో పాత్రలను బట్టే భాషను వాడారు. గురువులు బోధించిన జ్ఞానం. చదివిన కావ్యాలు, చేసిన సినిమాలు.. ఇవన్నీ నాలో సాహిత్యాభిలాషను ద్విగుణీకృతం చేశాయి. ఈ పుస్తక రచనలో అది తోడ్పడింది. నేను చెబుతూ ఉంటే.. రచయిత హాసం రాజా దీన్ని గ్రంథస్థం చేశాడు. నా మాటల్నే అందంగా భావగర్భితంగా అర్థవంతంగా అక్షరాలతో పొందుపరిచాడు.

ఇది మీ సమగ్రమైన చరిత్ర అనుకోవచ్చా?
రేపు వెళ్లిపోతుంటే.. ఈరోజు రాసేది సమగ్ర చరిత్ర. ఇంకా ఉన్నానుగా..(నవ్వుతూ)

...✍ నరసింహా బుర్రా

కష్టపడే ప్రతిరోజూ మంచిదే! మంచి కోరే ప్రతి మనిషీ ఉన్నతుడే!! కాలాన్ని ఉన్నతంగా మార్చుకోవడం మన చేతుల్లోనే ఉంది. మనస్ఫూర్తిగా చేసే చేతలకు కాస్త నమ్మకం తోడైతే.. అపజయం ఉండదని పెద్దల మాట. దాన్ని అనుసరించి.. ఇస్తున్నదే ఈ ఏడాది అదృష్ట చక్రం.

అదృష్టం 2024

మేషం »
అదృష్ట సంఖ్య: 9
వారం: గురువారం
రంగు: ఎరుపు
దైవం: సుబ్రహ్మణ్య స్వామి
తేదీలు: 9,18,27
నెలలు: మార్చ్, ఏప్రిల్, జూన్, సెప్టెంబర్

వృషభం »
అదృష్ట సంఖ్య: 6
వారం: శనివారం
రంగు: తెలుపు
దైవం: లక్ష్మీదేవి
తేదీలు: 6, 15, 24
నెలలు: మే, అక్టోబర్

మిథునం »
అదృష్ట సంఖ్య: 5
వారం: శనివారం
రంగు: ఆకుపచ్చ
దైవం: విష్ణుమూర్తి
తేదీలు: 5, 14, 23
నెలలు: జూన్, జూలై, ఆగస్టు

కర్కాటకం »
అదృష్ట సంఖ్య: 2
వారం: గురువారం
రంగు: తెలుపు
దైవం: శివుడు
తేదీలు: 2, 11, 20, 29
నెలలు: జూన్ చివరి వారం, జూలై

సింహం »
అదృష్ట సంఖ్య: 1
వారం: ఆదివారం
రంగు: లేత ఎరుపు
దైవం: సూర్యభగవానుడు
తేదీలు: 1, 10, 19, 28
నెలలు: ఏప్రిల్, మే

కన్య »
అదృష్ట సంఖ్య: 5
వారం: శుక్రవారం
రంగు: ఆకుపచ్చ
దైవం: శ్రీమన్నారాయణుడు
తేదీలు: 5, 14, 23
నెలలు: జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్

« తుల
అదృష్ట సంఖ్య: 6
వారం: బుధవారం
రంగు: తెలుపు
దైవం: దుర్గాదేవి
తేదీలు: 6, 15, 24
నెలలు: ఏప్రిల్, మే, సెప్టెంబర్, అక్టోబర్

« వృశ్చికం
అదృష్ట సంఖ్య: 9
వారం: సోమవారం
రంగులు: ఎరుపు
దైవం: వినాయకుడు
తేదీలు: 9, 18, 27
నెలలు: మార్చ్, ఏప్రిల్, అక్టోబర్, నవంబర్

« ధనుస్సు
అదృష్ట సంఖ్య: 3
వారం: ఆదివారం
రంగు: పసుపు
దైవం: దత్తాత్రేయ స్వామి
తేదీలు: 3, 12, 21, 30
నెలలు: ఫిబ్రవరి, జూలై

« మకరం
అదృష్ట సంఖ్య: 8
వారం: బుధవారం
రంగు: నీలం
దైవం: ఈశ్వరుడు
తేదీలు: 8, 17, 26
నెలలు: ఆగస్ట్, సెప్టెంబర్

« కుంభం
అదృష్ట సంఖ్య: 8
వారం: శుక్రవారం
రంగులు: నీలం
దైవం: ఆంజనేయస్వామి
తేదీలు: 8, 17, 26
నెలలు: మార్చ్, ఏప్రిల్, మే, సెప్టెంబర్, అక్టోబర్

« మీనం
అదృష్ట సంఖ్య: 3
వారం: గురువారం
రంగు: పసుపు
దైవం: శ్రీకృష్ణుడు
తేదీలు: 3, 12, 21, 30
నెలలు: ఫిబ్రవరి, జూన్, సెప్టెంబర్, డిసెంబర్

...✍ గుడి ఉమామహేశ్వర సిద్ధాంతి

ముంబయి నెర్వస్సే!

తెలుగులో వచ్చిన 'లోఫర్' సినిమాతో వెండితెరకు పరిచయమైన నటి దిశా పటానీ. టాలీవుడ్ నుంచి బాలీవుడ్‌కు వెళ్లిన దిశ అక్కడ కూడా మంచి గుర్తింపు సాధించింది. ప్రస్తుతం కల్కి, యోధ, కంగువా లాంటి మెగా ప్రాజెక్టుల్లో నటిస్తున్నది. చిన్నప్పటి నుంచి సైంటిస్ట్ కావాలనుకున్న దిశ అనుకోకుండా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిందట. 'చిన్నప్పుడు పెద్దగా అల్లరి చేసేదాన్ని కాదు. చదువుల్లో టాప్‌లో ఉండేదాన్ని. సైంటిస్ట్ కావాలనుకునే దాన్ని. పరిశోధనలవైపు వెళ్లాలనుకున్నా. కానీ, నా డెస్టినీ మరోలా ఉంది. లక్నో యూనివర్సిటీలో ఉండగా ఓ మాడలింగ్ కాంపిటిషన్ జరిగింది. ఆ పోటీ గురించి నాకు తెలియదు. పోటీదారుగా ఫ్రెండ్స్ నా పేరిచ్చారు. ఎందుకు ఇచ్చారని అడిగితే.. 'విజేతను ముంబయికి పంపుతార'ని చెప్పారు. ముంబయి చూడాలన్న కోరికతో ఆ పోటీలో పాల్గొన్నా. లక్కీగా గెలిచా. అలా మాడలింగ్ వైపు నా అడుగులు పడ్డాయి. నలుగురిలోకి రావాలంటేనే మొహమాటపడేదాన్ని. అలాంటి నేను కెమెరా ముందుకు వచ్చినప్పుడు కాస్త తికమక పడ్డా. కానీ, ఎప్పుడైతే నటనను ప్రొఫెషన్‌గా భావించానో, అప్పటినుంచి ఏ ఇబ్బందీ అనిపించలేదు. మా అమ్మ చాలా అందంగా ఉంటుంది. సినిమాల్లోకి రావాలని ఉండేదట కూడా! ఆమె కోరిక నా ద్వారా నెరవేరిందేమో!' అని చెప్పుకొచ్చింది దిశ.

ఎనర్జీ దాచుకోకుండా..

'గుంటూరు కారం' ఘాటును సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న పాట 'ఓ మై బేబీ'. టింగ్లిష్ లిరిక్స్‌తో సాగిపోయే ఈ పాటకు శిల్పారావు హస్కీవాయిస్ అదనపు కిక్కునద్దింది. కర్ణాటక సంగీతంతో అచ్చికలాడిన ఆమె గళం.. హిందుస్థానీ రాగాలనూ అలవోకగా పలికించగలదు. మెలోడీ టు పాప్ ఏ రకం పాట ఇచ్చినా తన పాటవంతో మెప్పించడం ఆమెకు రివాజు. సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతున్న శిల్పారావు జీవిత గమకాల సంగతులు ఆమె మాటల్లోనే..

- మా అమ్మ మాతృభాష తెలుగు. చిన్నప్పటి నుంచీ తెలుగు పాటలు వినడం నాకు అలవాటే! కర్ణాటక సంగీతం బాగా వినేదాన్ని. అలా సంగీతం నా జీవితంలో భాగమైంది. సంగీతంపై నా ఆసక్తిని గమనించిన మా తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారు. ఉస్తాద్ గులామ్ ముస్తాఫా ఖాన్ దగ్గర హిందుస్థానీ సంగీతం నేర్చుకున్నాను.
- సినిమాల్లో పాడే అవకాశం అనుకోకుండా వచ్చింది. హిందీ, తమిళం, కన్నడ, తెలుగు ఇలా వివిధ భాషల్లో పాటలు పాడాను. 2007లో తొలి బ్రేక్ వచ్చింది. హిందీలో వచ్చిన 'అన్వర్' చిత్రంలో 'తోనే నైనా..' పాట నాకు మంచి గుర్తింపునిచ్చింది. తర్వాత ఎన్నో మంచి మంచి పాటలు పాడే అవకాశాలు వచ్చాయి. తాజాగా 'గుంటూరు కారం'లోని 'మై బేబీ..' పాటకు నేను ఊహించిన దాని కన్నా ఎక్కువ రెస్పాన్స్ వస్తున్నది.

- మ్యూజిక్ డైరెక్టర్ థమన్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. లిరిక్స్‌తోపాటు మ్యూజిక్ కూడా చాలా బాగా కుదిరింది. పాట రికార్డింగ్ టైమ్‌లో చాలా ఎంజాయ్ చేశాను. నా ఎనర్జీ ఏ మాత్రం దాచుకోకుండా పాడేశాను.
- హైదరాబాద్ అద్భుత నగరం. ఇక్కడ మ్యూజిక్ లవర్స్ కూడా ఎక్కువే! కొత్తదనాన్ని సాదరంగా స్వాగతిస్తారు. మినీ ఇండియాను తలపించే హైదరాబాద్ నాకు ఎప్పుడూ స్పెషలే!
- గాత్రం బాగుండాలంటే సాధన చాలా అవసరం. మన ఆహార నియమాలు కూడా గాత్రశుద్ధికి దోహదం చేస్తాయి. శరీరం డీ హైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. కంటి నిండా నిద్ర చాలా అవసరం. ఒత్తిడికి గురికానంత కాలం గాయకులకు ఏ సమస్యా రాదు. ఎప్పుడైనా ఒత్తిడికి గురైతే.. చిన్న బ్రేక్ తీసుకుంటాను. నా దగ్గరివాళ్లతో సమయం గడుపుతాను. మంచి ఆహారం తీసుకుని రిలాక్స్ అవుతాను. సంగీతం తర్వాత నాకు ఇష్టమైనది ఏదైనా ఉందంటే అది ఆహారమే!
- సంగీతం, చిత్రలేఖనం, నృత్యం, ఇతర క్రీడలు ఇవన్నీ మనసుకు తృప్తినిచ్చేవే! ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని సాధన కొనసాగించాలి. కెరీర్‌గా మలుచుకోకున్నా అభిరుచిని మాత్రం విడిచిపెట్టొద్దు.